రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





**ఊరూరా రాఖీ సంబురాలు**
**పజాప్రతినిధుల ఇళ్ల వద్ద కోలాహలం**
**పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు**
**బస్టాండ్లు, మార్కెట్లలో రద్దీ**



సిఎం రేవంత్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి



వికారాబాద్ డిసిసి చీఫ్ ధారాసింగ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు

2లో

# అనుబంధాల వేడుక

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా రక్షాబంధన్ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, సోదరభావంతో ముగిశాయి. పల్లెల నుంచి పట్టణాల వరకు అక్కాచెల్లెళ్లు తమ తోడబుట్టినవారికి ఆప్యాయంగా రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ ఉట్టిపడింది. జిల్లాలోని ప్రధాన నాయకులు, ఎమ్మెల్యేల నివాసాల వద్ద మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాఖీలు కట్టారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు స్వచ్ఛంద సంస్థల మహిళలు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బంధువుల ఇళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు, ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడాయి. రాఖీలు, స్వీట్ల విక్రయాలతో మార్కెట్లు సందడిగా మారాయి.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య

# ఆశల గూడు

**బడుగుల ఇంటి కలకు ఇందిరమ్మ టవర్స్ రూపం**
**ఉచితంగా రూ.60-70 లక్షల విలువైన ఇళ్లు**
**రాజేంద్రనగర్‌లో 480 ఇళ్లకు లక్కీడ్రా ప్రారంభం**
**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అవకాశం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





లక్కీ డ్రా తీస్తున్న మంత్రి పొంగులేటి

**రంగారెడ్డి అర్బన్,ఆగస్టు 28,ప్రభాతవార్త:** సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం కల. ఆ కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమం పట్టణ పేదల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన, శాశ్వత నివాసాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మిగూడలోని లక్షి ్మ భవనం-పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహిం చిన ఇందిరమ్మ టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ లక్ష ్యం రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష ్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు.
తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు.

**525 చదరపు అడుగుల్లో సొంతిల్లు**

ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు.భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని వివరించారు. భూమి విలువ సుమారు రూ.50 నుంచి రూ.60 లక్షలు ఉండగా, నిర్మాణ వ్యయం రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇంత విలువైన ఇంటిని అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఎటువంటి ఖర్చు లేకుండా అందజేస్తుందని స్పష్టం చేశారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీదే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.

గతంలో పేదలకు దూర ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి కేటాయించడం వల్ల ఉపాధి, పిల్లల చదువులు, సామాజిక సంబంధాల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యేవని మంత్రి గుర్తు చేశారు. ఈ సమస్యలకు పరిష్కారంగా లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలు తమ జీవనాధారాన్ని కోల్పోకుండా, కుటుంబంతో కలిసి సొంత ప్రాంతంలోనే స్థిరపడేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు.

**లక్కీ డ్రా అంటే తుది ఎంపిక కాదు**

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, రిజర్వేషన్ విధానాలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నట్లు తెలిపారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదన్నారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతిక పరిశీలన నిర్వహించి, పత్రాలు, అర్హతలను ధ్రువీకరించిన తర్వాతే తుది ఎంపిక జరుగుతుందని వివరించారు.

**ఇల్లు రాకపోయినా నిరాశ వద్దు**

మొదటి విడత లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సి న అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా ఇచ్చారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులకు కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒకసారి పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు భావించవద్దని స్పష్టం చేశారు.

**ఏడాదిలోపు తాళాలు అందించడమే లక్ష్యం**

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్స రంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష ్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఒక ఇంటిని అందించే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం అందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని పేర్కొన్నారు.

**ప్రతి అర్హుడికి న్యాయం : ప్రకాశ్ గౌడ్**

స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ,పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగడం సంతోషకరమన్నారు.ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

**480 ఇళ్లకు 1,881 దరఖాస్తులు**

హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి.గౌతమ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ నిబంధనలను అమలు చేస్తూ పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారుల కోసం వేచి ఉన్నవారి జాబితాను నిర్వహిస్తామని, భవిష్యత్‌లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఎంపిక ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి,రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.







# ఐరన్ రాడ్లు మీదపడి వలస కూలీ మృతి

**నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**
**నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్**

**కొడంగల్, అగస్టు 28 ప్రభాతవార్త :** కొడంగల్‌లోని ఎస్వీకే నిర్మాణ కంపెనీలో భారీ భద్రతా లోపాలు కూలీల ప్రాణాలను గాలిలో దీపాలుగా మారుస్తున్నాయి. పట్టణంలోని ఈ కంపెనీ పరిసరాలోనే వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వలస కూలీ నరసింహులుగౌడ్ (45) ఐరన్ రాడ్లు మీదపడి దుర్మరణం చెందాడు. గురువారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో యజమాన్యం తీవ్ర నిరక్ష ్యంగా వ్యవహరిస్తూ విషయాన్ని గోప్యంగా ఉంచడమే కాకుండా, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలోనూ ఇదే సంస్థలో ఇటువంటి ప్రమాదాలు జరిగాయని మృతుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ ఘోర ప్రమాదం తెలుసుకున్న బీఎస్పీ నాయకులు యు.రమేష్ బాబు, తెలంగాణ ఉపాధ్యాయ/ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్రనపల్లి శ్రీనివాస్, సీపీఐ నాయకులు గంటి సురేష్‌కుమార్ తదితరులు కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. మృతుడి భార్య ఇదివరకే మరణించడంతో ఈ ప్రమాదంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని నాయకులు ఆవేదన చెందారు. ఎస్వీకే కన్స్ట్రక్షన్ సంస్థ తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి ..1 కోటి నష్టపరిహారంతో పాటు ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వారాసిగూడ బ్రాహ్మణ బస్తీలో వరలక్ష్మీ దేవి అలంకారం

# శ్రావణ కళ..

**▶వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు ▶కిటకిటలాడిన ఆలయాలు**
**▶పూలధరలకు రెక్కలు**

భాగ్యనగరంతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో శ్రావణ శుక్రవారం శోభ ఉట్టిపడింది. మహిళలు వరలక్షి ్మ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల ప్రాంగణాల్లో భక్తుల రద్దీ కనిపించింది. గుడిమల్కాపూర్, జంబాగ్‌లతో పాటు ప్రధాన మార్కెట్లన్నీ తెల్లవారుజాము 4 గంటల నుంచే కిటకిటలాడాయి. తమలపాకులు, మామిడాకులు, రంగురంగుల పూల కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాల్లో పండుగ రష్ కనిపించింది. సాధరాణంగా ఉండే ధరలకు రెండింతలు పెంచి వ్యాపారులు క్యాష్ చేసుకున్నారు. దేవీ ఆలయాలన్నీ భక్తజనసందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# ఎన్కతలలో భూ దందా..

**ఇందిరమ్మ స్థలాలపై ప్రైవేట్ వ్యక్తుల కన్ను**
**పేదల జాగా కబ్జాపై సర్పంచ్ ఆగ్రహం**
**తహసీల్దార్‌కు ఫిర్యాదు**

**మోమిన్‌పేట్, ఆగస్టు 28. ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో పేదల ఇండ్ల స్థలాల భూమి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంపై స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద ఇందిరమ్మ ఇండ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా మార్చుకొని, ప్రైవేట్ వ్యక్తులు పట్టా చేసుకున్నారనే వ్యవహారం గ్రామంలో కలకలం రేపింది. ఈ విషయమై గురువారం మోమిన్‌పేట్ తహశీల్దార్ మునీరుద్దీన్‌కు గ్రామ సర్పంచ్ పటేల్‌గారి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బాధితులు, బుద్ధ విజ్ఞాన కేంద్రం ప్రతినిధులతో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎన్కతల గ్రామంలోని సర్వే నెంబర్ 294 లో ఉన్న 2 ఎకరాల 9 గుంటల వీకర్ సెక్షన్ కాలనీ భూమిని 198384 సంవత్స రంలో బలహీన వర్గాల ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అయితే ఈ భూమితో పాటు, పొరపాటున కలెక్టర్ డీఎస్ పెండింగ్‌లో ఉన్న 30 గుంటల స్థలానికి సంబంధించి జరిగిన 59 గుంటల అక్రమ పట్టాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్కతల వాసులు

ప్రైవేట్ వ్యక్తుల పేరిట ఉన్న పట్టాలను రద్దు చేసి, రెవెన్యూ రికార్డులను పునరుద్ధరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో స్థానిక విచారణ జరిపి, ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామంలోని అర్హులైన పేదలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పటేల్‌గారి శ్రీకాంత్ గౌడ్, బుద్ధ విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నర్సిం లు, మాజీ సర్పంచ్ అనంతయ్య, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చెంద్రయ్య, వార్డు సభ్యులు ఉప్పరి శ్రీను, మెట్టు రాములు, లాలయ్య, మన్నె బ్రహ్మం, మల్లయ్య, బోయ జగన్, బాధితులు మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# బొల్లినేని వర్సెస్ బొల్లినేని

**జూబ్లీహిల్స్ సొసైటీ ఎన్నికల్లో హోరాహోరీ పోరు**

**జూబ్లీహిల్స్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 30న జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. సొసైటీ చరిత్రలో తొలిసారిగా 4,039 మంది సభ్యులతో తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రెండు ప్యానళ్ల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. సొసైటీ అధ్యక్షుడు బొల్లినేని రవీంద్రనాథ్ నేతృత్వంలోని ప్యానల్ 19 ఒకవైపు.. బొల్లినేని సీనయ్య నేతృత్వంలోని మరో ప్యానల్ బరిలో నిలిచాయి. ఇప్పటికే ఇరుప్యానళ్ల అభ్యర్థులు సభ్యులను కలుస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సొసైటీ భవిష్యత్తు, సభ్యుల ప్రయోజనాలు, అభివృద్ధి అంశాలపై ఇరువర్గాలు తమ విధానాలను వివరిస్తూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాయి. 'క్లీన్ జూబ్లీహిల్స్.. రవీంద్రనాథ్ ప్యానల్ సొసైటీని కాపాడుకుందాం,'క్లీన్ జూబ్లీహిల్స్ నినాదాలతో సభ్యుల ముందుకు వెళ్తున్నట్లు రవీంద్రనాథ్ ప్యానల్ చెబుతోంది. ప్యానల్ 19కు ఓటు వేసి సొసైటీ భవిష్యత్తుకు బలమైన నాయకత్వాన్ని అందించాలని సభ్యులను కోరుతోంది. సొసైటీకి సంబంధించిన అంశాలపై తాను దాదాపు 150కుపైగా కేసులను ఎదుర్కోవాల్సి వచ్చిందని రవీంద్రనాథ్ చెపుతున్నారు. సొసైటీ ప్రయోజనాల పరిరక్షణ కోసం తాము పోరాడుతున్నామని తెలిపారు. మరోవైపు సీనయ్య సభ్యత్వంపై రవీంద్రనాథ్ పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సీనయ్యకు సొసైటీలో సభ్యత్వం లేదని, అలాంటి వ్యక్తి ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తున్నారని ఆయన ప్రశ్నిస్తున్నారు. మార్పు కోసం.. సీనయ్య ప్యానల్ ప్రచారం మరోవైపు సీనయ్య ప్యానల్ "మార్పు కోసం" అన్న నినాదంతో సభ్య లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. సొసైటీలో కొత్త నాయకత్వం, కొత్త విధానాలు అవసరమని ఆ ప్యానల్ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

# నగరంలో రాఖీ రష్

**కిక్కిరిసిన బస్టాండ్లు - ఆర్టీసీ బస్సులు చాలక ప్రయాణికుల అవస్థలు- ప్రైవేటు దోపిడి**

**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త:**
రాఖీ సందర్భంగా శుక్రవారం నగరంలోని బస్టాండ్లు కిటకిటలా డాయి. బస్సుల్లో జనం సైతం కిక్కిరిసి కనిపించారు. వరుస సెలవులు రావడంతో చాలా మంది సొంతూళ్లకు పయనమ య్యారు. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్ బస్టాండ్లలో రద్దీ నెలకొంది. ఐదు వేల ప్రత్యేక బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పా టు చేసింది. డిమాండ్ ఉన్న రూట్లలో అదనంగా సిటీ బస్సులను నడుపుతుంది. ఈ నెల 31 వరకు ప్రత్యేక బస్సుల ను ఆర్టీసీ నడపనుంది. గతేడాది కంటే అదనంగా 240 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది.ఉప్పల్ నల్లచెరువు వద్ద తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేసిన ఆర్టీసీ.. నల్లచెరువు నుంచి వరంగల్, హన్మకొండ, నర్స ంపేట, జనగాం, యాదాద్రి, తొర్రూరు వైపు ప్రత్యేక బస్సు లు నడుపుతుంది.రద్దీ ఉన్న రూట్లలో అదనపు సర్వీసులను ఆర్టీసీ అందుబాటులోకి తెస్తుంది.ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనపు ఛార్జీ వసూలు చేస్తోంది.రాఖీ పండుగతో పాటు లాంగ్ వీకెండ్ కారణంగా రద్దీ మరింత పెరగనుంది. అలాగే తిరుగు ప్రయాణాల్లోనూ రద్దీ ఉం టుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయా ణికులకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



## పుప్పాలగూడలో పేలిన వాషింగ్ మిషన్

**- తృటిలో తప్పిన ప్రాణాపాయం**

**నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త :** మణికొండ డివిజన్ పుప్పాలగూడ గోల్డెన్ టెంపుల్ సమీపంలోని ఓ ఇంట్లో శుక్రవారం వాషింగ్ మిషన్‌లో పెద్దగా శబ్దం వచ్చి మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల్లోనే ఆ మంటలు ఇతర వస్తువులకు వ్యాపించడంతో ఇంట్లోని కుటుంబ సభ్యులు బయటకు వెళ్లేందుకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ సంఘటనలో కొంత ఆస్తినష్టం జరిగినా ప్రాణాపాయం నుంచి కుటుంబ సభ్యులు క్షేమంగా బయట పడి ఊపిరి పీల్చుకున్నారు. భారీ ఎత్తున చెలరేగిన మంటలను ఆర్పేందుకు స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. కానీ 55.నిమిషాల తరువాత ఫైర్ ఇంజన్ వచ్చింది. దీంతో స్థానికులు ఫైర్ ఇంజన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుప్పాలగూడకు సమీపంలోనే ఉన్న ఫిలింనగర్, గోల్కొండ ఫైర్ స్టేషన్ల సిబ్బంది స్పందించి ఉంటే కేవలం 15.నిమి షాల వ్యవధిలోనే సంఘటనా స్థలనాకి వచ్చే వారని, మా ఏరియా కాదంటూ వారు మిన్నకుండడంతో గచ్చిబౌలి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేందుకు తీవ్ర జాప్యం అయ్యిందని స్థానికులు మండి పడుతున్నారు.



హ్యాపీ రాఖీ అంటూ వరుణ్‌మోటార్స్ సీనియర్ మేనేజర్ సురేష్‌బాబును దీవిస్తున్న సోదరి రాధికావంశీ



సోదరుడు నరసింహారెడ్డికి తిలకం దిద్ది రాఖీ కడుతున్న మాజీ మంత్రి సబిత



విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్‌కు రాఖీ కడుతున్న సోదరి



ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డికి రాఖీ కట్టిన శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి అనితలాలయ్య



జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



చల్లా వంశీచంద్‌రెడ్డికి రాఖీ కడుతున్న చైర్మన్ యాటగీత నర్సింహ్మా



ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి రాఖీ కడుతున్న సర్పంచి మౌనిక



జిల్లేడు చౌదరి గూడెంలో..




ఆర్‌జిఐఎ పోలీసు స్టేషన్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్‌కు రాఖీ కడుతున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధి



కొత్తూరులో...



పరిగిలో..

# అనుబంధాల వేడుక

## ఊరూరా రాఖీ సంబరాలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తాండూరు పట్టణంలోని డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ నివాసంలో ఆయనకు తన ఆత్మీయ సోదరిమణులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారికి స్వీట్లు తినిపించి, తమ మధ్య ఉన్న ఆత్మీయతను పంచుకున్నారు.

**రంగారెడ్డి అర్బన్ :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు వివిధ ప్రాంతాల్లో ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవంగా సాగాయి. రంగారెడ్డి అర్బన్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకొని, తన సోదరుడికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కేవలం ఒక దారపు బంధం మాత్రమే కాదని, ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అని, ప్రతి కుటుంబంలో ఆనందాలను నింపుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ కూడా ఈ వేడుకల్లో పాల్గొనగా, ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి) :** మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాలు, మండలాల్లో ప్రజలు సాంప్రదాయబద్ధంగా సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి ఆప్యాయతలను పంచుకున్నారు. శామీర్పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఈ పండుగ వాతావరణం కనిపించింది. అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి తన కూతురితో కలిసి సీఎమ్ రేవంత్రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు తోటకూర జంగయ్యయాదవ్ కు కూడా ఆమె రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు మాజీ జడ్పీటిసి ఎం. అనితలాలయ్య మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డితో పాటు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డికి రాఖీలు కట్టారు. ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్రెడ్డికి ఆయన సోదరి రాఖీ కట్టగా, డీసీసీ అధ్యక్షులు తోటకూర జంగయ్యయాదవ్‌కు ఆయన సోదరీమణులు రాఖీలు కట్టి వేడుకలు జరుపుకున్నారు.

**జిల్లెడు చౌదరి గూడెం:** జిల్లెడు చౌదరి గూడెం, కొందుర్గు మండలాల్లో అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి దీవెనలు తీసుకోగా, సోదరులు కానుకలు, నూతన వస్త్రాలూ, నగదు సమర్పించారు. పూల, మిఠాయి, రాఖీల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్వగృహంలో మహిళా అధ్యక్షురాళ్లు నాగమణి, పిట్ట రజిత, అనసూయ, బాలమణి తదితరులు ఆయనకు రాఖీలు కట్టగా, ఎమ్మెల్యే వారికి అన్న కానుకగా రూ.50 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుల బుచ్చయ్య, సర్పంచులు శ్రీశైలం, అశోక్, బాబు నాయక్, వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్ పద్మశాలి సంఘం భవనంలో వర్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 108 మంది దంపతులతో గణపతి పూజ, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద పద్మశాలీయుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆపద్బాంధవుడు పథకాన్ని, స్వయం ఉపాధి కోసం అప్పు సహాయం అందించే వ్యాపార మిత్ర పథకాన్ని ప్రారంభించారు.

**నందిగామ :** నందిగామ మండలంలో మొదలగూడెం గ్రామానికి చెందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి తన అక్కల చేత రాఖీ కట్టించుకున్నారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు మండలంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీతనర్సింహ్మా, కాంగ్రెస్ నాయకుడు చల్లా వంశీచంద్ రెడ్డికి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీలు కట్టగా, మంగళపల్లి సర్పంచ్ మోనిక బిజెపి నాయకుడు తల్లోజు ఆచారికి రాఖీ కట్టారు. శివాలయంలో మాజీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ వేడుకలు జరిగాయి. గుర్రంగుట్ట మార్కేండేయ దేవాలయంలో మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కౌన్సిలర్ భాగ్యమ్మ తదితరుల సమక్షంలో గాయత్రీధారణ, యజ్ఞపవితరణ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

**శంషాబాద్:** శంషాబాద్ పద్మశాలి మార్కండేయ సేవా సమితి అధ్యక్షుడు పులిపాటి పాండు ఆధ్వర్యంలో గణపతి పూజ, మార్కండేయ వ్రతం, జంధ్యాల పౌర్ణమి, రాఖీ ధారణ కార్యక్రమాలు జరిగాయి. వర్కల శ్రీరాములు, బొడ్డు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. శంషాబాద్ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, ఎస్ఐ హర్షద్ అలీలకు నాయకులు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

**పెద్దేముల్ :** పెద్దేముల్ మండలంలోనూ రాఖీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. తాండూరులోని డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్‌కు ఆయన సోదరీమణులు రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకున్నారు.

**కేశంపేట:** కేశంపేట మండలంలో కాకునూర్ గ్రామంలో గోనెల రమేష్, గోనెల మహేష్ లకు వలికే రేణుక రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. తోబుట్టువుల ఆత్మీయ కలయికలతో గ్రామాలన్నీ పండుగ వాతావరణంతో అలారారాయి.

**కొత్తూరు :** కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలోనూ, పరిగి టౌన్ మండల వ్యాప్తంగానూ మహిళలు సోదరులకు రాఖీలు కట్టి, బహుమతులు అందుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దుద్యాల్ :** దుద్యాల్ మండల కేంద్రంలోని శ్రీ పతంజలి యోగాశ్రమంలో మహర్షి శ్రీ యోగానంద స్వాముల వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పూజలు, ధ్వజారోహణం మరియు జ్యోతి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

**కొడంగల్ :** కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘం ప్రతినిధి ఆనందమ్మ, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కమిషనర్ బలరాంనాయక్, కౌన్సిలర్లకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఘట్‌కేసర్ :** రక్షాబంధన్ వేడక సందర్భంగా ఘట్‌కేసర్ పట్టణంలో రాఖీల, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామికి బొక్కొనిగూడ చిన్నారులు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డికి పారిశుద్ధ్య కార్మికులు రాఖీ కట్టి మిఠాయి తినిపించగా వారికి ఆయన కానుకలను అందజేశారు. పండుగ సందర్భంగా బస్‌టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. ఆర్టీసీ బస్సులు రద్దీకి అనుగుణంగా ఎక్కువ సర్వీసులను నడపకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహనాలలో ప్రయాణం సాగించారు. కార్లు, ఆటోల డ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలను వసూలు చేశారు. హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి (163)పై విపరీతమైన వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి, యంనంపేట్ చౌరస్తాలో రద్దీ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు రోడ్డుపై దుమ్మురేగు తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుటుంబ సభ్యులు



రాఖీ వేడుకల్లో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు



దుద్యాల్‌లో జ్యోతి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



కొడంగల్‌లో..




ఘట్‌కేసర్ సిఐ బాలస్వామికి రాఖీ కడుతున్న చిన్నారులు



మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డికి రాఖీ కడుతున్న పారిశుద్ధ్య కార్మికులు



సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజలక్ష్మీ



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి పద్మ

## సిఎం నివాసంలో సందడి

**హైదరాబాద్ ఆగస్టు 28,ప్రభాతవార్త :** రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలసిన మహిళా కమి షన్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ్మ ముఖ్య మంత్రి కి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రేవంత్ రెడ్డికి భగవంతుడు ఆయురారోగ్యాలను, మరిన్ని విజయాలను చేకూర్చాలని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకాంక్షి ంచారు.

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో..**

రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బర్కత్‌పురలోని ఆయన నివాసంలో రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, కావ్య దంపతులకు తన సోదరి పద్మ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిష న్‌రెడ్డి తన సోదరి పద్మ ఆశీస్సులు తీసుకు న్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాఓలు తెలియ జేస్తూ ప్రజలంతా సుఖసంతోశాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



ఆమనగల్లు పురాతన శివాలయంలో రక్షాబంధన వేడుకల దృశ్యం



మార్కేండేయ దేవాలయంలో వేడుకలకు హాజరైన మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్



నందిగామ మండలం మొదల్లగూడలో సోదరితో రాఖీ కట్టించుకుంటున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి




రక్షాబంధనం గాయత్రి మాల ధారణ కార్యక్రమంలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు



పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో..



వరలక్ష్మివ్రతంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ సంగీతారెడ్డి

## భక్తి, శ్రద్ధలతో వరలక్ష్మివ్రతం పూజలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో శుక్రవారం శ్రీవరలక్ష్మివ్రతం పూజను భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం 4 శుక్రవారం కావడంతో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ దత్తాత్రేయనగర్‌కాలనీలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి తన నివాసంలో వరలక్ష్మివ్రతాన్ని ఆచరించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయాల్లో వరలక్ష్మి అమ్మవారి ప్రతిమను ప్రతిష్టించి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజ చేయడం వల్ల అష్టలక్ష్మీ ఆశీస్సులు లభించి, కుటుంబంలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని ప్రగాఢ నమ్మకం. పూజా వేదికను మామిడి, అరటి తోరణాలు, పూలతో అలంకరించి కలశస్థాపనతో అమ్మవారికి పూజలు చేసి వివిధ రకాల నైవేధ్యాలు వండి సమర్పించారు. మాజీ కౌన్సిలర్ సంగీతా ప్రభాకర్‌రెడ్డి ముత్తైదువులను పిలిచి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, అరటిపళ్లు, వక్కలు అందజేసి వయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



జంగారెడ్డిపల్లిలో పైప్‌లైన్ మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్ దుడ్డు, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

## కౌన్సిలర్ చొరవతో నీటి సమస్యకు పరిష్కారం

**ఆమనగల్లు, ఆగస్టు28, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వవార్డు జంగారెడ్డిపల్లిలో నీటి సరఫరా పైప్‌లైన్ ధ్వంసం అయింది. దీంతో గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు ప్రత్యేక చొరవ తీసుకుని మున్సిపాలిటీ సహకారంతో సమస్యకు పరిష్కారం చూపించారు. శుక్రవారం కమీషనర్ రాఘవేంద ర్‌రెడ్డి గ్రామంలో పర్యటించి సిబ్బందితో ధ్వంసం అయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు ఎదురైన ఆటంకాలను తొలగిం చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులుతో కలిసి కమిషనర్ గ్రామ వీధుల గుండా పర్య టించారు. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీల ఆవశ్యకత గురించి కౌన్సిలర్ కమిషనర్ దృష్టికి తీసుకుపోయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## ప్రతాప సింగారం గ్రామ కాంగ్రెస్ కమిటీ నియమాకం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాప సింగారం గ్రామ కాంగ్రెస్ కమిటీని నియమించినట్లు డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ శుక్రవారం నాడొక ప్రకటనలో తెలి పారు. ప్రతాప సింగారం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గ్యార సురేశ్, వర్కింగ్ ప్రెసిడెంటుగాఎం. గణేశ్, ఉపాధ్యక్షులుగా, బి. సాయిగౌడ్, ఎం. దర్శన్, గౌరవ అధ్యక్షుడిగా ఎన్. కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.మల్లేశ్, కార్యదర్శిగా జి. చైతన్య, కార్యవర్గ సభ్యులుగా నవీన్‌గౌడ్, బిక్షపతి, కార్తీక్, సాయి, నవీన్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లుగా వినోద్, సంతోశ్, సలహాదారులుగా వెంకటేశ్, మోహన్‌రెడ్డిలను నియ మించినట్లు తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న జిల్లా యువజన శాఖ అధికారి దామోదర్‌రెడ్డి

## ఘనంగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా యువజన,క్రీడల అధికారి కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మేడ్చల్ జిల్లా యువజన,క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆదేశాల మేరకు జాతీయ క్రీడా దినోత్సవం-2026 సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిం చుకోవటం జరుగుతుందన్నారు. మొదటి రోజున జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించటం జరిగిందని జిల్లా అధికారి వై.దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఖేల్ ఇండియా సైక్లింగ్ కోచ్, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



## నిరుపేద బాలిక వివాహానికి ప్రోత్సాహం

**తలకొండపల్లి ఆగస్టు 28, ప్రభాతవార్త :** మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా అనేక మంది నిరుపేదలను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. శుక్ర వారం నాడు ఉప్పల వెంకటేష్‌ను కలిసిన నిరుపేద బాలిక తన బాగో గుల గురించి వివరించడంతో చలించిపోయిన ఉప్పల వెంకటేష్ బాలిక వివాహానికి అయ్యే ఖర్చును, కళ్యాణ మండపాన్ని ఉచితంగా అందజే యనున్నట్లు ఈ సందర్భంగా కళ్యాణ మండపాన్ని ఉచితంగా అందజే యనున్నట్లు హామీ ఇచ్చారు. తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కా పూర్ గ్రామానికి చెందిన లక్నమోని పూజ నిరుపేదరాలు కావ డంతో ఇప్పటివరకు దాతల సహాయంతో 12 ఏళ్లుగా తన విద్యా భ్యాసాన్ని పూర్తి చేశారు. ఇటీవల పెళ్లి కుదరడంతో తన విద్యా భ్యాసానికి కృషి చేసిన మాకం శ్రీనివాస్‌ను కలిసి పెళ్లి పత్రిక అంద జేశారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్, చుక్కా పూర్ సర్పంచ్ వీరేష్ లింగం, చంద్రకుమార్ వార్డు సభ్యుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఫించన్ తీసుకోవటానికి వెళ్లి అదృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 28, ప్రభాతవార్త :** అలియాబాద్ గ్రామానికి పామిడి శేషగిరిరావు నెలవారి ఫించన్ తీసుకోవటానికి లాల్‌గడి మలక్ పేట్ పాత గ్రామపంచాయతీ ఆఫీస్ వద్దకు వెళ్లి తిరిగి రాకపోవటంతో జీనోమ్‌వ్యాలీ పోలీసులకు ఫిర్యాదు చేయ



టంతో మిస్సింగ్ కేసును నమోదు చేసినట్లు జీనోమ్‌వ్యాలీ పిఎస్ సిఐ గోపగాని గురువ య్యగౌడ్ తెలిపారు. శుక్రవారం ఈ విష యాన్ని ఆయన వెల్లడించారు. జీనోమ్ వ్యాలీ పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేట మం డలంలోని అలియా బాద్ గ్రామానికి చెందిన పామిడి శేషగిరిరావు (50) అనే వ్యక్తి గురువారం ఉదయం 9.30 గంటలకు లాల్‌గడిమలక్‌పేట్ పాత గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్దకు నెలవారీ ఫింఛను తీసుకోవటానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. శుక్రవారం తుర్క పల్లిలోని జీనోమ్‌వ్యాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పూడికతీత పనులపై తనిఖీ

**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఉప్పల్ దేవేందర్ నగర్‌లో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీల న నిర్వహించారు. ఉప్పల్ సర్కిల్‌లో జరుగుతున్న వివిధ పౌర, మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి మార్జిన్ల నిర్వహణ, నాలా శుభ్రత, డీసిల్టింగ్, సిడి వ్యర్థాల తొలగింపు, మొక్కల పెంపకం, గుంతల పూడ్చివేత తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో క్రమం తప్పకుండా మొక్కలు నాటాలని కమిషనర్ ఆదేశించారు. నాటిన మొక్కలను సక్రమంగా సంరక్షి ంచాలని, రోడ్డు మార్జిన్లను శుభ్రంగా ఉంచడంతో పాటు అనవసర వస్తువులు, వ్యర్థాలు మరియు ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు. అదే విధంగా నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్‌పేట్ ఎస్టీపీ వరకు దేవేందర్ నగర్ నాలా వెంట జరుగు తున్న పూడికతీత పనులు, ఫెన్సింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు.

# క్రీడలలో రాణించాలంటే క్రమశిక్షణ ముఖ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మై భారత్ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఖేలో ఇండియా- 'ఖేల్ కీ బాత్ పిఎం కే సాథ్' ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశం ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి.సాయిచరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్ష సందేశం వర్చువల్ కార్యక్రమంలో పేర్కొంటూ భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయటం, క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించటం, క్రీడా ప్రతిభను గుర్తించటం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించటం వంటి అంశాలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశం ద్వారా పేర్కొన్నారు. ఆ తరువాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూకట్‌పల్లిలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి.సాయిచరణ్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని యువతకు సూచించారు. దీనిలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.చందన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.నాగుల వేణు, డా.డి.పద్మ, డా.ఎ.గోపాల్‌లు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన



'ఖేల్ కీ బాత్ పిఎం కే సాథ్'లో పాల్గొన్న మేడ్చల్ క్రీడాకారులు

తరగతుల సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల మేడ్చల్‌లో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణువర్ధన్, వర్షిత్ దులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవలు, ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాధ తదితరులు పాల్గొన్నారు.

# అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోండి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక జ్ఞానం సాంకేతిక నైపుణ్యాలు వృత్తిపరమైన సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని అల్ట్రాటెక్ సిమెంటు లిమిటెడ్ తెలంగాన రీజనల్ హెడ్ నందిక శ్రీనివాస్‌రావు అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సస్టెనబుల్ కన్‌స్ట్రక్షన్, ఆధునిక సాంకేతికలపై నిపుణులతో అవగాహన సదస్సు జరిగింది. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ తుది సంవత్సరం కోరకు నిర్వహించిన సదస్సు విద్యార్థులకు ఆధునిక సాంకేతికలు, భవిష్యత్తు కేరీర్ అవకాశాలపై నిపుణులు ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. అల్ట్రా టెక్ రీజనల్ హెడ్ టెక్నికల్ సర్వీసెస్ ప్రతినిధి నందిక శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సస్టెనబుల్ కన్‌స్ట్రక్షన్, గ్రీన్ బిల్డింగ్స్, స్మార్ట్ టెక్నాలజీస్, ఏఐ ఆధారిత పరిష్కరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతల ద్వారా నిర్మాణ నాణ్యత, భద్రత, సామర్థ్యం, పర్యావరణ పరిరక్షణ, వనరుల సమర్థవంతమైన వినియోగాన్ని ఎలా మెరుగుపరచవచ్చో వివరించారు. ఈ సందర్భంగా కాంక్రీట్ టెక్నాలజీ సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో విద్యార్థులు రూపొందించే



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అల్ట్రాటెక్ సిమెంటు కంపెనీ ప్రతినిధి నందిక శ్రీనివాస్‌రావు

నిజమైన వినూత్నమైన ప్రయోజనకరమైన ప్రాజెక్టులకు స్పాన్సర్‌షిప్, అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉంటుందని ఇంజినీర్ నందిక శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెడ్ పల్లవిబద్రీ, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ వి. విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలే మేలు

కొత్తూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త: ఆత్మ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ రైతు వేదికలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కు వ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలు, మొక్కజొన్నలో సమగ్ర పంట యాజ మాన్య పద్ధతులపై రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆత్మ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇన్ముల్ నర్వ రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త దిలీప్ కుమార్ మొక్కజొన్న పంటలో నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, పురుగు-తెగుళ్ల నియం త్రణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి పి. గోపాల్ మాట్లాడుతూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు తమ పంటలను డిజిటల్ క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ కొర్ర రవి, వ్యవసాయ శాఖ అధికారులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## బిజెపి రూరల్ ఎస్సీ మోర్చ అధ్యక్షులుగా యాదగిరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా కార్యవర్గంను నియమించినట్లు జిల్లా రూరల్ బిజెపి ఎస్సీ మోర్చ అధ్యక్షులు కైర యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా బిజెపి రూరల్ ఎస్సీ మోర్చ కమిటీని జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ సమక్షంలో జిల్లా ఎస్సీ మోర్చ కార్యవర్గంను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శులుగా మంచాల మహేందర్, మరాఠి చుక్కయ్య, ఉపాధ్యక్షులుగా చక్రపాణి, చిప్పలపల్లి దినేశ్, రాంబాబు దొంతమల్ల, జామ్ సుదాకర్, కార్యదర్శులుగా సంకు మల్లేశ్, మేకల కీర్తన, తుంకి రామకృష్ణ, చింతకింది సుదాకర్, జలగం రవీందర్, సోషల్‌మీడియా చెంచుల శివ, కార్యవర్గ సభ్యులుగా కొర్రి రమేశ్, నీరుడు ఈశ్వర్, శివకేశవ్, బాలయ్య, కనకం నాగరాజు, కంచెమీది సుదర్శన్, బండెల స్వామిలను నియమించినట్లు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కైర యాదగిరి తెలిపారు.

## ఎన్ఎఫ్‌సినగర్‌లో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

**ఘట్‌కేసర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి లిపారు. ఎన్ఎఫ్‌సీనగర్ బస్తీ దవాఖానా ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరంలో ఏఎస్‌రావు నగర్ జెమ్‌కేర్ పాలోమి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని ఉచితంగా రక్తపోటు, మధుమేహపరీక్ష, దంత, నేత్ర, గుండె ఈసీజీ, ఆక్సిమీటర్ తదితర పరీక్షలు అవసరమైన మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. నిపుణులైన వైద్యుల కన్సల్టేషన్ సౌకర్యం ఉందని, గిఫ్ట్ వోచర్ కార్డు ఇస్తారని ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉచిత వైద్యసేవలు పొందాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు.



గరుడ సేవ నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

## వైభవంగా శ్రీమన్నారాయణస్వామి గరుడ సేవ

**ఘట్‌కేసర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో శుక్రవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. శ్రావణ రాఖీపౌర్ణమి సందర్భంగా గరుడ వాహనంపై శ్రీమన్నారాయణస్వామిని ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య పల్లకి ఉత్సవం జరిపారు. పౌర్ణమి శుక్రవారం కావడంతో భక్తులు ఆలయంలో స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆయ ధర్మకర్తలు టీపఈ శేషాచార్యులు, పార్థసారథి, పురుషోత్తమాచార్యులు, పవనకుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసి స్వచ్ఛకార్మికుల సమ్మె విరమణ

**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసిలో గత కొద్దిరోజులు లగా చెత్తసేకరణ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పుతారన్న సమాచారంతో ఇటీవల స్వచ్ఛ ఆటోకార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈనేప థ్యంతో కార్మికుల సమ్మె పై స్పందించిన అధికారులు గురువారం కమిషనర్ కర్ణన్‌తో యూనియన్ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా యూనియన్ లీడర్లతో చర్చించిన జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్ వి కర్ణన్ ఇంటింటి చెత్త సేకరణ ప్రైవేట్ ఏజెన్సీల ఇవ్వలేదని వెల్లడించినట్లు తెలిపా రు. స్వచ్ఛ ఆటో కార్మికులు విషయంలో ఏమైనా నిర్ణయం తీసుకునేది ఉంటే ముందుగా కార్మికులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కావున కమీషనర్ హామీతో నిరసన విరమించినట్లు స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రకటించారు. గత వారం రోజులుగా చెత్త డంపింగ్ యార్డ్ లో కాకుండా బయట డంప్ చేస్తూ నిరసన చేపట్టిన కార్మికులు రేపటి నుండి యధా విధిగా చెత్త సేకరణ కొనసాగిస్తామని వెల్లడించారు. తమ నిరసన పట్ల సానుకూలంగా స్పందించిన జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్, సిఎం రే వంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ స్టేట్ స్వచ్ ఆటో డ్రైవర్ కార్మికుల యూనియన్ నేతలుకాట్రావత్ గోపాల్ నాయ క్ , సూర గోపి, హంసరాలు అర్జున్, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.



లక్షబిల్వార్చన పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

## పాటిమీదిపల్లిలో ఘనంగా లక్ష బిల్వార్చన

**కొడంగల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** కొడంగల్ మండల పరిధిలోని పాటిమీదిపల్లి గ్రామంలోని మఠంలో కర్నాటక,అంతూర్,బెంతూర్ స్వామి రాచోటేశ్వరస్వామి సమ క్షంలో శుక్రవారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష బిల్వా ర్చన కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, పాటిమీదిపల్లి సర్పంచ్ కవితసంతోష్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో హాజరై లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామా నికి సంభందించిన పలు అభివృద్ధి పనులు, సమస్యలను గ్రామసర్పంచ్ కవిత సంతోష్‌లు మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ దృష్టి తీసుకువచ్చారు. స్పందిం చిన చైర్మెన్ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్దులు వెంకట య్యగౌడ్‌తో పాటు లక్ష్మీపల్లి సర్పంచ్ శివప్ప, కస్తూర్‌పల్లి సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు పట్టుకున్న బియ్యం వాహనం

## అక్రమ రేషన్‌బియ్యం స్వాధీనం

**ఘట్‌కేసర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులకు అంది న సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.9 వద్ద అక్రమంగా రేషన్ బియ్యం సేకరించి ఇతర చోట్లకు తరలిస్తున్నారని పోలీసులు తనిఖీలు జరి పారు. సూపర్ ప్రాఫిట్ ట్రక్ (టిజి30టి-5841)ను ఆపి చూడగా పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యం తరలిస్తున్న ధెరవత్ శ్రీను (40) ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రేషన్ కార్డుదారుల నుంచి కిలోకు రూ.16 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి అనంతరం మరో వ్యక్తికి కిలోకు రూ.20 చొప్పున విక్రయి స్తున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందాల్సి న రేషన్ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈకేసులో మరో నిందితుడు శంషాబాద్‌కు చెందిన శ్రీకాంత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సుమారు 25 క్వింటాళ్ల బియ్యం, ఒక వాహనం, ఒక మొబైల్ ఫోన్, రూ.7,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

## కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంట్టింటికి ఇందిరమ్మ ఆటోమేటిక్ కుట్టు మిషన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి బి.సి. వర్గానికి చెందిన మహిళలకు ఉచిత కుట్టు మిషీన్లు పంపిణీ చేస్తుందని, కావున టిజిఓబిఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా సెప్టెంబర్ 15 లోగా దరఖాస్తు చేసుకోగలరని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఒక ప్రకటనలో తెలిపా రు.ఈ పథకం కింద నిరుద్యోగ మహిళ లు ముఖ్యంగా నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, వితంతువులు, అనాద మహి ళలకు ప్రాదాన్యత ఇవ్వడం జరుగు తుందని తెలిపారు.పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 1,000 కుట్టు మిషన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## పోచమ్మ గుడికి రూ.51వేల విరాళం..

**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో జరుగుతున్న పోచమ్మ దేవాలయ నిర్మాణ పనులకు ఈరోజు షాద్ నగర్ ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ రూ. 50వేలు విరాళం అందించారు. ఈ విరాళాన్ని స్థానిక సర్పంచ్ ఆర్ బాబు నాయక్, గ్రామ నాయ కులు జాంగారి రవి, జాం గారి జంగయ్య కు అందజేశారు ఈసం దర్భంగా ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వెల్ జర్ల గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ గుడికి తన వంతుగా సహాయం చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండ గా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిం చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షి ంచారు. అలాగే ఈనెల 30 వ తేదీన జరిగే పోచమ్మ గుడి ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజ రు కావాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిం చి తప్పకుండా వస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్, గ్రామ నేతలు, జాంగారి జంగయ్య, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికుడి మృతి

**నందిగామ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** నందిగామ మండల పరిధిలోని మేక గూడా గ్రామంలోని ఒకరిన ఇంజనీరింగ్ స్టోన్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తున్న బిఆర్ రాష్ట్రానికి చెందిన పప్పు యాదవ్ (30) ఛాతి నొప్పితో బాధపడుతూ మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న పప్పు యాదవ్ కు ఒకసారిగా చాతి నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తనను ఆసుపత్రికి తరలించాలని కంపెనీ యాజమా న్యాన్ని కాంట్రాక్టర్లను పంపి యాదవ్ వేడుకున్న ఎవరూ పట్టించు కోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పరిశ్రమల పని చేస్తూ ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగిన అటు యాజమాన్యం కానీ, ఇటు కాంట్రాక్టర్లు గానీ పట్టించుకున్న దాఖలాలు కనిపిం చడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలి

**షాద్‌నగర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** పో కర్ణ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు పప్పు యాదవ్ మృతికి బాధ్యులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మృతుడి కుటుంబం తరఫున కంపెనీ ఎదుట బైఠాయించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.



దేవాలయానికి విరాళం అందజేస్తున్న శ్రీరాములు

## ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళాలు

**ఆమనగల్లు, ఆగస్టు28, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం రాం నుంతల పెద్దతండాలోని తుల్జాభవాని మాత ఆలయం అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో పలువురు భక్తులు ఆర్థిక విరాళాలు అంద జేశారు. గ్రామ మాజీ సర్పంచు రచ్చ శ్రీరాములు రూ. 25వేలు, బీక్యనాయక్ రూ. 21వేల రూపాయల విరాళాలను శుక్ర వారం ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈసందర్భంగా ఆల యంలో జరుగుతున్న ప్రత్యేక పూజలలో వీరిని శాలువాతో సత్కా రించి అభినందించారు. దేవాలయాల అభివృద్ధితో ఆధ్యాత్మిక భావన వెల్లివిరుస్తుందని శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో ఆల య అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ ఎంపిటీసీ సరితపంతు నాయక్, జీంతనాయక్, నానునాయక్, తేజురాం, రవి, నర్సింగ్, వినోద్, వెంకటేశ్, రాము, పరమేశ్, నరసింహా ఉన్నారు.

## అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ అన్నోజిగూడలోని సర్వేనెంబరు 93లో తనకు చెందిన భూమిపై మరొకరికి ఇచ్చిన విద్యుత్ కనెక్షన్ తొలగించాలని కోరుతూ నారపల్లి విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బి. బాల్‌రాజ్ గౌడ్ శుక్రవారం తెలిపారు. తనకు చెందిన భూమికి నిబంధనలకు విరు ద్ధంగా అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను బి. మల్లారెడ్డికి ఇచ్చారని వెంటనే విద్యుత్ కనెక్షన్ తొలగించాలని కోరారు. భూమిపై పూర్తి చట్టబ ద్ధమైన హక్కులు, డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నప్పటికీ నిబం ధనలు అతిక్రమించి అధికారులు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేశా రని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు అధికారులను కోరినట్లు తెలిపారు.

# అభివృద్ధి పనులు భేష్

### -హైడ్రా పనితీరును ప్రశంసించిన బీహార్ సిటీ మేనేజర్లు

**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త:**

నగరం నడిబొడ్డున చెరువుల ఆక్రమణలు తొలగించడం..వాటిని పునరు ద్ధరించడం సామాన్యమైన విషయం కాదని బిహార్‌కు చెందిన సిటీ మేనేజర్లు ప్రశంసించారు. నగరంలో సరస్సుల పరిరక్షణ, పునరుజ్జీవనం, పర్యావరణ పరిరక్షణ కోసం హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ), హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ మేనేజింగ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్స్‌లో భాగంగా బిహార్ నుంచి వచ్చిన సిటీ మేనేజర్ల (ఐఏఎస్ అధికారులు)బృందం నగరాన్ని సందర్శించింది. హైడ్రా ఆధ్వర్యం లో జరుగుతున్న చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించింది. కూకట్‌పల్లిలోని నల్ల చెరువు ఆక్రమణల తొలగింపు నుంచి చెరువు పునరుద్ధరణ ప్రస్తుత పరిస్థితి వరకూ చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షి స్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ వివరించారు.చుట్టూ వేల సంఖ్యలో నివాస ప్రాంతాలున్నాయి. మొత్తం కాంక్రీట్ జంగిల్‌గా ఉన్న ప్రాంతంలో వర్షం నీటికి నల్లచెరువు మార్గం చూపిందని హైడ్రా అధికారులు వివరించారు. చెరువుకు ఇన్లెట్లు, ఔట్లెట్లు అభివృద్ధి చేయడంతో వరద ముప్పు ఈ ప్రాంతానికి తొలగిందన్నారు. గత ఏడాదితో పోల్చితే భూగర్భ జలాలు కూడా బాగా పెరిగాయని స్థానికులు ఈ సందర్భంగా వివరించారు. చెరువు చుట్టూ ప్రయాణించి బండ్ నిర్మాణంతో పాటు అక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ప్లే ఏరియాను తిలకిం చారు. సరస్సు పునరుజ్జీవన పనులు చేపట్టకముందు ఉన్న పరిస్థితులు, అనంతరం చేపట్టిన చర్యలు, సరస్సు పరిధి పరిరక్షణ, పరిసరాల అభివృద్ధి, ఆక్రమణల నియంత్రణ, నీటి వనరుల రక్షణ తదితర అంశాలపై హైడ్రా అధికారులు సిటీ మేనేజర్లకు వివరించారు.

## మహిళ చికిత్సకు రూ. 5 లక్షల ఎల్‌ఓసి అందజేత



సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల్ఓసీని పేషెంట్ కుమారుడికి అందిస్తున్న డా.చిన్నారెడ్డి.

**బేగంపేట ఆగస్టు 28,ప్రభాతవార్త**

తీవ్రమైన వెన్నెముక సమస్యతో బాధపడుతూ నిమ్స్ లో చేరిన మహిళ చికిత్స కోసం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ. ఐదు (5) లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి) ని పేషంట్ పద్మమ్మ కుమారుడు రాజశేఖర్ రెడ్డికి సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అందజేశారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో జరిగిన 251 సీఎం ప్రజావాణి కార్యక్రమానికి నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పెద్రి పాడ్ గ్రామానికి చెందిన అన్నసారం పద్మమ్మ కుమారుడు రాజశేఖర్ రెడ్డి వచ్చి చిన్నారెడ్డికి సమస్యను వివరించి ఎల్ఓసి ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నిమ్స్ వైద్యులు ఇచ్చిన ఎస్టిమేషన్, రోగ వివరాలు అన్నీ కలిపి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ లెటర్ అఫ్ క్రెడిట్ ఇస్తూ సీఎం కార్యాలయం లేఖను నిమ్స్ డైరెక్టర్ కు డబ్బులు లేకుండా చికిత్స చేయాలని ఆదేశించారు. చికిత్స తర్వాత బిల్లులు సీఎం కార్యాలయానికి పంపాలని సూచించారు. ఇదంతా కొన్ని గంటల్లోనే చక చక జరిగిపోయింది. తమ సమస్యపై వెంటనే స్పందించి ఎల్ఓసి మంజూరు చేయించిన ముఖ్యమంత్రి, చిన్నారెడ్డికి పద్మమ్మ కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

## దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంత్ రావుకు అమ్మవారి పట్టుచీర, ఒడి బియ్యం అందజేత



దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతురావుకు అమ్మవారి పట్టుచీరను అందజేస్తున్న తంగడపల్లి శివశంకర్.

**మెహిదీపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగియడంతో దేవాలయ వృత్తి పనివార్ల సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుకు అమ్మవారి పట్టు చీర, ఒడి బియ్యం, గాజులను అందజేయడంతోపాటు శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ... గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలను నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అందించడంతోనే విజయవంతంగా ముగియడం జరిగిందని తెలిపారు. ప్రతి ఏడు అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది భక్తులు తరలివస్తుండడం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సన్మానించిన వారిలో సంఘం సలహాదారులు రావుళ్ళకొల్లు నర్సింగ్ రావు, కాసాల శివశంకర్, అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్, ప్రధాన కార్యదర్శి హర్షగుర్త, సుధీర్ కుమార్‌లు ఉన్నారు.

## నల్లకుంట అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో మాజీ కార్పొరేటర్ వై.అమృత, బిఆర్ఎస్ నాయకురాలు లిఖిత అమర్నాథ్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

అంబర్ పేట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ కూరగాయల మార్కెట్ రోడ్‌లో రూ. 30 లక్షల నిధులతో నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు మాజీ కార్పొరేటర్ వై.అమృత, బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత అమర్నాథ్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం స్థానిక కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అభివృద్ధి పనుల పట్ల సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. చేపడుతున్న పనులను సకాలంలో పూర్తిచేయాలని, అందుకు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ, మేనేజర్ పరమేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హరినాథ్‌రెడ్డి, బిజెపి నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోష్ ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేడి ప్రసాద్, భాస్కర్ గౌడ్, మూర్తి, నవీన్, ఉద్యమ నాయకుడు కూర నరేందర్, లావణ్య, నల్లకుంట సిటిజన్ అసోసియేషన్ నాయకులు వీరయ్య, కిరణ్ కుమార్ , మోహన్ పాల్గొన్నారు.

## రైతు డిస్కంలలో ఘనంగా రాఖీ వేడుకలు

### సిఎండీ ముషారఫ్‌కు రాఖీ కట్టిన ఉద్యోగులు



సిఎండీ ముషారఫ్ అలీకి రాఖీ కడుతున్న ఉద్యోగులు

**హైదరాబాద్, ఆగస్టు 28,ప్రభాతవార్త:**

తెలంగాణ రైతు డిస్కంలో శుక్రవారం రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ సుధా మాధురి, ఇతర మహిళా ఉద్యోగుల సమక్షంలో సిఎండీ ముషారఫ్ ఫరూఖీకి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సోదరభావం, ఆప్యాయతకు ప్రతీకగా రాఖీ పండుగ ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంస్థలో ఉద్యోగుల మధ్య సోదరభావం, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# అన్నచెల్లెళ్ల , అక్కతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి రాజేశ్వరరావుకు రాఖీ కడుతున్న మహిళలు



ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వారి నివాసంలో రాకీ కడుతున్న మహిళలు దృశ్యం



కూకట్‌పల్లిలో రక్ష బంధన్ వేడుకల్లో భాగంగా మహిళల రక్ష కట్టించుకున్న బండి రమేష్



రక్షాబంధన్ సందర్భంగా రాఘవేంద్ర కాలనీ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట పద్మ సిద్ధిరాములుకు రాఖీ కడుతున్న మహిళలు



రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుకు రాఖీ కడుతున్న మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.



రాఖీ పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కంటెస్టెడ్ కార్పొరేటర్ హజ్రా సుల్తానా.



ఆరోగ్యనగర్‌లో అన్నతమ్ముళ్లకు రాఖీ కడుతున్న చెల్లెలు మారినేని అహల్య.



రహమత్ నగర్‌లో జరిగిన రాఖీ వేడుకలో డాక్టర్ రవిశేఖర్‌రెడ్డికి రాఖీలు కడుతున్న ముస్లిం మహిళలు



సిఎం రేవంత్ రెడ్డికి కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మామిడి మాధవి రాఖీ కడుతున్న దృశ్యం



మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దారుల్‌షిఫాలోని రెయిన్‌బో హోం పిల్లలకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించగా సంతోషం వ్యక్తం చేస్తున్న అనాథ విద్యార్థులు



బిజెపి రాష్ట్ర మైనారిటీ మోర్చ నాయకుడు మొహమ్మద్ మహమూద్‌కు రాఖీ కడుతున్న గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావనీ వినయకుమార్



రాఖీపూర్ణమి సందర్భంగా రాంనగర్‌లో హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాఖీ కడుతున్న పారిశుద్ధ్య కార్మికులు



రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీలు



రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని మార్కండేయ నగర్‌లో అక్కలు తమ చిన్ని తమ్ముళ్ళకి రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకుంటున్న దృశ్యం



స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో రసూల్‌పురా వద్ద అనాథలు, నిరాశ్రయులకు రాఖీలు కడుతున్న ప్రతినిధులు.



రక్షాబంధన్ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కు రాఖీ కడుతున్న అశోక్ నగర్ సి ఎస్ బి అకాడమీ అధినేత్రి, ప్రముఖ విద్యావేత్త బాలలత



సిఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న ఎర్రబెల్లి స్వర్ణ, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

## పోలింగ్ కేంద్రాల్లో నోటీసుల జారీ ప్రక్రియపై ఈఆర్ఓ సమీక్ష..

**జీడిమెట్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న నోటీసుల జారీ, తదుపరి విచారణ ప్రక్రియను కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి పింకేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. 28.08.2026న అధికారులతో కలిసి 045-కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్-57లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పర్యటనలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న నోటీసుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఇప్పటివరకు జారీ చేసిన నోటీసుల వివరాలు, వాటి ఆధారంగా చేపడుతున్న తదుపరి చర్యలపై బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత వ్యక్తులకు విచారణ నిర్వహించే విధానం, వారి నుంచి వివరాలు స్వీకరించే ప్రక్రియపై బీఎల్‌ఓలతో చర్చించారు. విచారణకు హాజరయ్యే ప్రతి ఒక్కరి వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని పింకేష్ కుమార్ సూచించారు. ఓటర్ల నుంచి అందే సమాచారం, సమర్పించే పత్రాలు, విచారణకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో ఎలాంటి



బీఎల్‌ఓలకు పలు సూచనలు చేస్తున్న కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్..

పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. విచారణకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు, సంబంధిత అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## ఎస్. జానకి గాత్ర మాధుర్యం చిరస్మరణీయం : ఏనుగు నరసింహారెడ్డి

**చిక్కడపల్లి ఆగస్టు 28 ప్రభాతవార్త :** దక్షిణ భారత చలనచిత్ర సంగీత ప్రపంచంలో గానకోకిల ఎస్. జానకి చిరస్మరణీయ ముద్ర వేశారని తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆమె ఆలపించిన వేలాది మధుర గీతాలు తరాలు మారినా శ్రోతలను అలరిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో శుక్రవారం ఆనంద భైరవి సాంస్కృతిక, సాంఘిక సంస్థ అధినేత్రి, ప్రముఖ సినీ నేపథ్య గాయని శారదాసాయి ఆధ్వర్యంలో సినీ నేపథ్య గాయకుడు సాందీప్, గాయని మాళవిక పంతులను ఘనంగా సత్కరించారు. తిరుమల కోఆపరేటివ్ బ్యాంకు, విశిష్ట ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ గాయని శారదాసాయి స్వరసారథ్యంలో డాక్టర్ బంటి, ఆర్.శంకర్, షానవాజ్ షేక్, జ్యోతిర్మయి, స్వరకల్యాణి తదితరులు ఎస్. జానకి ఆలపించిన అలనాటి మధుర గీతాలను గానం చేశారు. ఈ పాటలు సంగీత ప్రియులను విశేషంగా అలరించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ సంగీత క్షేత్రానికి ఎస్. జానకి అందించిన సేవలు అనన్యసామాన్యమన్నారు. సంగీతాభిమానుల హృదయాల్లో ఆమె పాటలకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఆమె గాత్ర మాధుర్యం తెలుగు సినీ సంగీత



సినీ నేపథ్య గాయకుడు సాందీప్‌ను సత్కరిస్తున్న లంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, చిత్రంలో అంతర్జాతీయ గాయని శారదసాయి తదితరులు

చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చలనచిత్ర దర్శకులు వి.ఎన్. ఆదిత్య, డాక్టర్ వంశీ రామరాజు, విశిష్ట ఎస్టేట్స్ ఛైర్మన్ రావుల వెంకటేశ్వరరావు, తిరుమల బ్యాంక్ ఛైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, నటులు శివ కాంతమనేని, దొనేపూడి చక్రపాణి, డాక్టర్ మేడిది వెంకటేశ్వరరావు, వడ్లకొండ వెంకట్రావు, పి. విజయసారథి, కె.వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆనంద భైరవి సంస్థ సభ్యులు సాయి నాగసందీప్, ఉమాసింధు, రాధా మోహన్, డాక్టర్ హిమబిందు, మహేష్, గీత హాజరయ్యారు.

## ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ప్రతిధ్వనించిన వేదమంత్రాలు

### సనాతన ధర్మ సంప్రదాయంలో

### వైఖానస ఆగమోక్తంగా దివ్య క్రతువులు

**చిక్కడపల్లి ఆగస్టు 28 ( ప్రభాతవార్త ) :** సనాతన వైదిక సంప్రదాయంలో దేవాలయ శుద్ధికీ, విశ్వశాంతికీ అత్యంత ప్రాధాన్యత కలిగిన పవిత్రోత్సవాలు ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ లోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీ పంచముఖ అంజనేయ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక శోభతో వైభవంగా సాగుతున్నాయి. శ్రావణ పౌర్ణమి మహత్కార్యాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి వైఖానస ఆగమశాస్త్రోక్తంగా "పవిత్ర సమర్పణ" మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రాహ్మీ ముహూర్తాన సుప్రభాత సేవతో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని మేల్కొలిపిన అర్చకస్వాములు, ధర్మరక్షణకు సూచికగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన క్రతువులను పూర్తి చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మహాకుంభమునకు వేదమంత్రాల నడుమ విశేష ఆరాధన చేశారు. ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి, సీఈఓ పి.ఎ. మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో భాగంగా సర్వజన సౌఖ్యం కొరకు అగ్నిప్రతిష్ఠాపన హోమాలు, పవిత్ర అధివాసము, లఘు పూర్ణాహుతి నిర్వహించి మహామంగళనీరాజనం సమర్పించారు. సనాతన ధర్మంలో పవిత్రోత్సవానికి విశిష్టమైన స్థానముంది. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ తెలియక జరిగే మంత్ర తంత్ర లోపాలు, ఆశౌచ దోషాల నివారణార్థం నూలుతో రూపొందించిన పవిత్ర మాలలను స్వామివారి మూలవిరాట్ కు, ఉత్సవమూర్తులకు



శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీ పంచముఖ అంజనేయ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హోమాది కార్యక్రమాలను నిర్వహించిన

ధరింపజేశారు. సాయంత్రం భక్తుల హరినామ స్మరణలు, విష్ణు సహస్రనామ పారాయణం నడుమ కుంబారాధన, మూలమంత్ర హవనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పవిత్ర ధారణతో ఆలయ ప్రాంగణమంతా దివ్య తేజస్సుతో విలసిల్లింది. కార్యక్రమంలో ఆలయం ప్రతినిధి బండి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

**నేడు శ్రీవారి శాంతి కల్యాణం**

ఉత్సవాల్లో భాగంగా శనివారం ) ఉదయం జగత్ కళ్యాణకారకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి "శాంతి కల్యాణం" కన్నులపండువగా జరగనుంది. తదనంతరం భక్తులందరికీ విశేష అన్నసమారాధన (మహా ప్రసాద వితరణ) ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి, సీఈఓ పి.ఎ. మురళి తెలిపారు. భక్తజనులందరూ ఈ ధర్మకార్యంలో పాల్గొని స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## గండిపేట మండలంలో ఘనంగా 'రాఖీ' వేడుకలు

**నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త :**

అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన "రాఖీ" పర్వదినం గండిపేట మండలంలో ఘనంగా జరిగింది. ఆడపడుచులు తమ పుట్టింటికి వచ్చి అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టి సంబరపడిపోయారు. సోదరులు తమ ఆడపడుచులకు తమ తాహతుకు తగ్గ బహుమతులు, చీరలు, బంగారం పెట్టి నీకు రక్షగా నిలుస్తానని మాట ఇచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. తమ కడుపున పుట్టిన బిడ్డల ఆనందాలను చూసిన తల్లిదండ్రులు మురిసిపోయారు. ఎన్ని గొడవలున్నా, మనస్పర్థలున్నా ఈ రాఖీ పండగకు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టడం వలన అవన్నీ సమసిపోతాయని వయోజనులు పేర్కొన్నారు. ఖానాపూర్ మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సిహ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత క్యాతం అశోక్ యాదవ్‌ల ఇళ్లకు స్థానిక మహిళలు వెళ్లి రాఖీలు కట్టి ఆనందపడ్డారు. మండలంలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట్, కోకాపేట్, నార్సింగి, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మంచిరేవుల, గంధంగూడ, హైదర్షాకోట్, పీరంచెరువు, బండ్లగూడ, హిమాయత్ సాగర్ ప్రాంతాలలో రాఖీ దుకాణాలు ఆడపడుచులతో కిటకిటలాడాయి.



ఖానాపూర్ మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నేత రామేశ్వరం నర్సిహ్మకు రాఖీలు కడుతున్న మహిళలు



నార్సింగిలో సీనియర్ కాంగ్రెస్ నేత క్యాతం అశోక్ యాదవ్‌కు రాఖీలు కడుతున్న ముస్లీం మహిళ

## అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ కొరడా

### బాపునగర్‌లో 14 అక్రమ మోటార్లు స్వాధీనం



మోటార్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

**సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** జలమండలి నీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడుతున్న వారిపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డివిజన్-16 ఎస్.ఆర్.నగర్ వార్డు బాపునగర్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 14 అక్రమ మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పైపులైన్లకు నేరుగా మోటార్లు అమర్చి నీటిని తోడటం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందకపోవడంతో పాటు సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని జలమండలి అధికారులు తెలిపారు. అక్రమ మోటార్ల వినియోగంపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.